



మన రైతుతో

ప్రధాని మాటామంతి



ప్రధానమంత్రి మోదీతో మాట్లాడుతున్న రైతు మల్లికార్జున్‌రెడ్డి

- వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా వర్చువల్ మీటింగ్
- చొప్పదండి మండలం పెద్దకుర్మపల్లికి చెందిన మల్లికార్జున్‌రెడ్డి అనుభవాలను అడిగి తెలుసుకున్న నరేంద్ర మోదీ
- ఉన్నత చదువులు చదివి.. వ్యవసాయం చేయడం అభినందనీయమని ప్రశంస

చొప్పదండి, జనవరి 18: వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని పెద్దకుర్మపల్లికి చెందిన రైతు మావురం మల్లికార్జున్‌రెడ్డితో ప్రధాని నరేంద్ర మోదీ న్యూఢిల్లీ నుంచి వర్చువల్ సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి తెలంగాణ, రాజస్థాన్, హర్యానా, మేఘాలయ, మహారాష్ట్ర రాష్ట్రాలకు చెందిన పలువురితో మాట్లాడారు. రాష్ట్రం నుంచి చొప్పదండి మండలం పెద్ద కుర్మపల్లి గ్రామానికి చెందిన మావురం మల్లికార్జున్ రెడ్డితో ముచ్చటించారు. ఈ సందర్భంగా మల్లికార్జున్‌రెడ్డి వ్యక్తిగత వివరాలు, ప్రకృతి, సమీకృత వ్యవసాయం గురించి మోదీ అడిగి తెలుసుకున్నారు. ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థితిలో ఉన్నప్పటికీ సొంత గ్రామంలో వ్యవసాయం చేస్తున్న మల్లికార్జున్‌రెడ్డి లాంటి రైతులు యువతకు ఆదర్శమని ఆయన అభినందించారు. ఆ వివరాలు మీకోసం..

- **మల్లికార్జున్‌రెడ్డి:** ప్రధానమంత్రి నరేంద్రమోదీకి నమస్కారం
- **ప్రధాన మంత్రి:** నమస్కారం మల్లికార్జున్‌గారు.. మీరు కూర్చుని మాట్లాడండి.. అక్కడ ఉన్న వారందరికీ నమస్కారం.. మీ గురించి కాస్త వివరించండి..
- మీతో మాట్లాడడం.. నాకు స్ఫూర్తిదాయకం.. నేను బీటెక్ గ్రాడ్యుయేట్‌ను.. హైదరాబాద్‌లో ఎమ్మెన్సీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేసేవాడిని. 2014 నుంచి వ్యవసాయం చేస్తున్నాను..
- హైదరాబాద్‌లో ఉద్యోగం విడిచిపెట్టి గ్రామానికి వస్తే మీ భార్య, పిల్లలు ఇబ్బంది పడలేదా.. మిమ్మల్ని ఏమీ అనలేదా..?
- తను కూడా ఓ గ్రాడ్యుయేట్.. నా ఆలోచనలను అర్థం చేసుకుని నన్ను ప్రోత్సహించింది..

(మల్లికార్జున్‌రెడ్డి భార్య) ఎప్పుడూ ఇబ్బంది పడలేదు.. అందరం సంతోషంగా ఉన్నాం..

- బీటెక్ గ్రాడ్యుయేట్ అయి వుండి.. మల్టీనేషనల్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్న మీకు వ్యవసాయం చేయాలనే ఆలోచన ఎలా వచ్చింది..?
- నాకు వ్యవసాయం అంటే చాలా ఇష్టం. చదువుకున్న వారు తమ ఆలోచనలతో వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చవచ్చని ఈ రంగంలోకి వచ్చాను. నేను కేవీకే శాస్త్రవేత్తల సూచనతో సమీకృత వ్యవసాయ పద్ధతులను పాటిస్తున్నాను. ఆవులు, కోళ్లు, మేకలు, చేపలు పెంచుతున్నాను. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించాను.
- మీరు వ్యవసాయంలో ఉన్న అన్ని మార్గాలను అనుకూలంగా మార్చుకున్నారు. వీటన్నింటితో మీకు ఆదాయం వస్తుంది.. అవునా..
- అవును సార్..
- మీకు ఏయే ప్రభుత్వ పథకాలతో ప్రయోజనం చేకూరింది.
- నాకు కిసాన్ క్రెడిట్ కార్డు వచ్చింది. ఈ కార్డుతో నాకు ఐదు లక్షల రుపాయల రుణం లభించింది. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా లబ్ధి జరిగింది.
- కిసాన్ క్రెడిట్ కార్డుపై తీసుకున్న రుణానికి ఎంత శాతం వడ్డీ చెల్లించారు.
- ఏడు శాతం చెల్లించాను.
- ఏడు శాతం వడ్డీ ఉండదు.. మరొకసారి చూడండి. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా రుణం తీసుకుంటే కేంద్ర ప్రభుత్వంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం కూడా రైతులకు పలు ప్రయోజనాలు కల్పిస్తుంది. మీరు మరోసారి బ్యాంకుకు వెళ్లి చెక్ చేసుకోండి.
- మల్లికార్జున్‌గారు.. మీరు చేసే సమగ్ర వ్యవసాయం గురించి వివరంగా చెప్పండి. ఈ విధానం వల్ల ఉండే ప్రయోజనాలను వివరించండి.
- సమగ్ర వ్యవసాయం ద్వారా రోజువారీ ఆదాయం ఉంటుంది. చేపలు, మేకలు, కోళ్ల ద్వారా మంచి ఆదాయం వస్తోంది. ఔషధ మొక్కలనూ పెంచుతున్నాను. దేశీ రకాల వరిని పండిస్తున్నాను. దీంతో మంచి ఆదాయం వస్తోంది. సాధారణ వ్యవసాయ పద్ధతులతో నాకు 12 ఎకరాల్లో సంవత్సరానికి ఆరు లక్షల రూపాయల ఆదాయం వచ్చేది. సమగ్ర వ్యవసాయం పద్ధతులు పాటించడంతో నా ఆదాయం రెట్టింపైంది. ఈసారి 12.35 లక్షల ఆదాయం సమకూరింది. ఐసీఎఫ్ సంస్థ నుంచి ఇన్నోవేటివ్ ఫార్మర్ అవార్డు వచ్చింది. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ప్రకృతి రైతు నేస్తం అవార్డు అందుకున్నాను. నా పద్ధతులు చూసిన తర్వాత సమీప గ్రామాల ప్రజలు సమగ్ర వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శిక్షణ ఇస్తున్నాను.
- మల్లికార్జున్ గారు.. నా కోసం ఒక పని చేస్తారా.. మీరు యూనివర్సిటీలకు వెళ్లి విద్యార్థులకు మీ అనుభవాలను బోధించండి.. వ్యవసాయం ద్వారా ఎంత సాధించేందుకు వీలుందో మీ ద్వారా చదువుకున్న వారందరికీ తెలియాలి. చదువుకున్న వారు వ్యవసాయంలోకి వస్తే ఎంత లాభం ఉంటుందో వారికి మీరు వివరించాలి..
- తప్పకుండా చేస్తాను సర్..
- మీలాగా చదువుకున్న వ్యక్తులు వ్యవసాయం చేయడం చాలా సంతోషంగా ఉంది. దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమం చూస్తున్న వారందరూ సంతోషపడతారు. వ్యవసాయం ద్వారా ఏమేం సాధించవచ్చో అని నిరూపించడానికి మీరొక నిదర్శనం. మీరు రసాయనాలు లేకుండా వ్యవసాయం చేస్తున్నారు. పశు పాలన, చేపల పెంపకం చేపడుతున్నారు. ఇరుగు పొరుగు గ్రామాల రైతులకు శిక్షణ ఇస్తున్నారు. మీరు మీ ప్రయోగాల ఫలితాలను ఎక్కువ మంది అందేలా చూడాలి. మీరు రైతులందరికీ స్ఫూర్తి. నా తరుపున మీకు అభినందనలు.. మీతోపాటు మీ సతీమణికి అభినందనలు. ఎందుకంటే అన్ని రకాల సౌకర్యాలను విడిచిపెట్టి మీతోపాటు వ్యవసాయం చేసేందుకు గ్రామానికి వచ్చారు. హైదరాబాద్‌లాంటి మహా నగరం నుంచి తీసుకొచ్చి పశువులు, మేకల మధ్య ఆమెను ఉంచారు. ఆమె మీకు అన్ని విధాలా సహకరిస్తున్నారు. ఇది భారత నారీశక్తికి నిదర్శనం. హృదయపూర్వకంగా ఆమెను అభినందిస్తున్నాను. అందరికీ కృతజ్ఞతలు.

శభాష్ మల్లికార్జున్ రెడ్డి..
అభినందించిన ఎంపీ..

రైతు మల్లికార్జున్‌రెడ్డి చేస్తున్న వ్యవసాయం ఆదర్శనీయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రను ఆయన ప్రారంభించిన అనంతరం రైతు మావురం మల్లికార్జున్ రెడ్డిని అభినందించారు. ఉద్యోగాన్ని వదిలేసి వ్యవసాయం చేస్తూ పంట దిగుబడిని రెట్టింపు చేసిన మల్లికార్జున్ రెడ్డిని నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సమాజానికి మల్లికార్జున్ రెడ్డి ఎంతో మేలు చేస్తున్నారని, సమీకృత వ్యవసాయంతో లాభాలు పొందుతున్నాడని, మల్లిఖార్జున్ రెడ్డి చేస్తున్న సాగు అందరికి ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పమేలా సత్పతి, హోం అఫైర్స్ డైరెక్టర్ యోగేష్ మోహన్ దీక్షిత్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, సంక్షేమశాఖ అధికారి సరస్వతి, డీఎంహెచ్‌వో లలితాదేవి, మెప్మా పీడీ రవీందర్, ఎన్‌ఐవో శ్రీరాములు, మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్, నోడల్ అధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.



- 28న కరీంనగర్‌కు అమిత్‌షా రాక
- 40 వేల మంది బూత్‌స్థాయి నేతలతో సమావేశం
- గెలుపే లక్ష్యంగా వ్యూహరచన

పార్లమెంట్ సమరానికి

బీజేపీ సన్నద్ధం

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, కరీంనగర్)

తెలంగాణలో పది పార్లమెంట్ స్థానాలను గెలుచుకుంటామని ప్రకటించిన బీజేపీ ఉత్తర తెలంగాణ జిల్లాలపై ప్రత్యేక దృష్టిసారించింది. గత ఎన్నికల్లో గెలుపొందిన కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ స్థానాలను నిలుపుకోవడంతోపాటు మెజార్టీ స్థానాల కైవసమే లక్ష్యంగా పెట్టుకొని ఆ పార్టీ ముందుకు సాగుతున్నది. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్‌లో బీజేపీ విజయకేతనాన్ని ఎగరవేయడం కోసం అవసరమైన వ్యూహరచన, నేతల్లో స్ఫూర్తిని నింపేందుకు ఆ పార్టీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా ఈనెల 28న ఇక్కడకు రానున్నారు.

ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అన్ని పోలింగ్ బూత్‌ల నుంచి ఒక్కో బూత్‌కు 20 మంది చొప్పున సుమారు 40 వేల మంది కార్యకర్తలు, నాయకులతో అమిత్‌షా సమావేశం కానున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించడానికి అనుసరించవలసిన ప్రచార వ్యూహాన్ని, ప్రజల సానుకూలతను ఓట్లుగా మలుచుకొనడానికి అవసరమైన కార్యా చరణను ఆయన కార్యకర్తల ముందుంచి అవగాహన కల్పిస్తారని సమాచారం.

గత ఎన్నికల్లో 90 వేల మెజారిటీ

గత పార్లమెంట్ ఎన్నికల్లో బండి సంజయ్ కుమార్ 90వేల మెజారిటీతో విజయం సాధించారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి లక్షా రెండు వేల ఓట్లు మాత్రమే రాగా, పార్లమెంట్ ఎన్నికల నాటికి 4.98 లక్షలకు పైగా ఓట్లు సాధించి బీజేపీ గెలుపొందింది. అసెంబ్లీ ఎన్నికలకు పార్లమెంట్ ఎన్నికలకు ఓటర్ల ఆలోచనా సరళి భిన్నంగా ఉంటున్నదని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి సానుకూలంగా స్పందించడంతోనే ఆ పార్టీ అభ్యర్థికి ఎక్కువ ఓట్లు వచ్చి గెలుపొందారని చెబుతున్నారు.

ప్రస్తుత ఎన్నికల్లో కూడా బీజేపీకి అనుకూలం గానే ఓట్లు వేస్తారని, తిరిగి కరీంనగర్ పార్ల మెంట్ స్థానాన్ని నిలబెట్టుకోవడం పెద్ద కష్టమేమి కాదని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అసెంబ్లీ స్థానాలలో బీజేపీకి 2,50,279 ఓట్లు పోలయ్యాయి. గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఈ ఓట్లు ఒకటిన్నర రెట్లు అధికం. ఈసారి గతం కంటే ఎక్కువ మెజార్టీతో గెలుస్తామన్న ధీమా ఆ పార్టీ కార్యకర్తల్లో వ్యక్తమవుతున్నది.

ఈ ఏడు అసెం బ్లీ నియోజకవర్గ పరిధిలో బీఆర్‌ఎస్‌కు 5,17, 596 ఓట్లు రాగా, కాంగ్రెస్‌కు 5,12,347 ఓట్లు వచ్చాయి. బీజేపీకి 2,50,279 ఓట్లు పోలయ్యాయి. గత పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ 4,98,276 ఓట్లు సాధించి 90వేల ఓట్ల మెజార్టీతో ఎంపీగా గెలుపొందారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్ కుమార్‌కు 4,08,768 ఓట్లు వచ్చాయి. కాంగ్రెస్ అభ్యర్థి పొన్నం ప్రభాకర్‌కు 1,79,258 ఓట్లు పోలయ్యాయి. ఈసారి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీకి ఓట్లు పెరిగి ముక్కోణపు పోటీ హోరాహోరీగా సాగినా బీజేపీకి విజయావకాశాలుంటాయని, ఇప్పటికే ఆ పార్టీకి అనుకూలంగా సానుకూల వాతావరణం కనిపిస్తున్నదని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

అక్రమార్కుల

గుండెల్లో దడ

- భూకబ్జాదారుల జాబితా సిద్ధం
- వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు
- ఠాణాలవారీగా పరిశీలన



కరీంనగర్ క్రైం, జనవరి 18: దశాబ్దకాలంగా ఇష్టారాజ్యంగా అవినీతి, అక్రమదందాలకు పాల్పడిన అక్రమార్కుల గుండెల్లో గుబులుపుట్టింది. బుధవారం ఒక కార్పొరేటర్‌తోపాటు మరో నాయకుడిని పోలీసులు అరెస్టు చేసి జైలుకు పంపించారు. భూ కబ్జాలపై చర్యలుంటాయా అని సంశయించిన బాధితులకు తాజా అరెస్టులతో నమ్మకం కలిగింది. దీంతో భూకబ్జాలు, బెదిరింపుల సంఘటనలకు సంబంధించిన బాధితులు న్యాయం కోసం ఫిర్యాదు చేసేందుకు సీపీ కార్యాలయానికి క్యూ కడుతున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్ అధికారులు భూకబ్జాలకు సంబంధించిన ఫిర్యాదులను ఠాణాలవారిగా పరిశీలిస్తున్నారు. ఈ ఫిర్యాదులపై సంబంధిత ఎస్‌హెచ్‌వోలు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? రాజకీయ ఒత్తిడిలతో ఫిర్యాదుతోనే వదిలేశారా? అనే విషయాన్ని పరిశీలిస్తూ బాధితుల ద్వారా మరింత సమాచారాన్ని సేకరిస్తున్నారు.

తాజా ఫిర్యాదులతో కేసులు నమోదు చేసి, నిందితులను అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. స్పెషల్‌టీం పోలీసు అధికారులు ఇప్పటికే పదుల సంఖ్యలో భూకబ్జాల బాధితుల నుంచి పూర్తి సమాచారాన్ని, ఆధారాలను సేకరించి 10 మందికిపైగా అక్రమార్కుల జాబితాను సిద్ధం చేశారని సమాచారం. ఇందులో వివిధ రాజకీయపార్టీలకు చెందిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులతోపాటు ద్వితీయశ్రేణి నాయకులు, రౌడీషీటర్లు, పాత నేరస్థులు ఉన్నట్లు తెలిసింది. ఈ జాబితాలోని కొందరు సీపీ చర్యలకు భయపడి ఫోన్‌స్విచాఫ్ చేసుకున్నట్లు, మరికొందరు ఎప్పుడు పోలీసుల నుంచి ఫోన్ వస్తుందోనని ఆందోళనకు గురవుతున్నట్లు సమాచారం. కార్పొరేటర్, ఓ పార్టీ నాయకుడి అరెస్టు విషయం తెలియగానే కొందరు నాయకులు సీపీతో మాట్లాడేందుకు ప్రయత్నించగా తప్పుచేసినవారిపై నిబంధనల ప్రకారం చర్యలుంటాయని ఆయన సమాధానం ఇచ్చినట్లు తెలిసింది.

మరో ఇద్దరు కార్పొరేటర్లపై ఫిర్యాదులు

ఇంటి స్థలాల విషయంలో బెదిరింపులు, దౌర్జన్యాలు, డబ్బులు తీసుకున్నారనే ఆరోపణలపై గురువారం మరో ఇద్దరు కార్పొరేటర్‌లపై బాధితులు పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. సూర్యనగర్‌కు చెందిన ఉపాధ్యాయుడు తాటిపెల్లి లింగారెడ్డికి సీతారాంపూర్ గ్రామశివారులో 24.5 (ఇరవై నాలుగున్నర) గుంటల స్థలముంది.

గతంలో సర్పంచ్, ప్రస్తుత కార్పొరేటర్ జంగిలి సాగర్ 40 లక్షలు డిమాండ్ చేశాడని ఆరోపించాడు. ఆ తరువాత జంగిలిసాగర్ కార్పొరేటర్‌గా గెలిచిన అనంతరం తాను డబ్బులు ఇవ్వలేదనే కారణంగా తన భూమిలో మూడు గుంటల స్థలంలో రోడ్డు వేశాడని, మళ్లీ డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడని తెలిపారు.. 10 లక్షల రూపాయలు ఇస్తేనే మీకు అనుమతులు ఇస్తానని బెదిరించి 2 లక్షలు కార్పొరేటర్ జంగిలి సాగర్ కూతురు పేరిట ఫోన్‌పే ద్వారా, మరో 8 లక్షలు నగదుగా తీసుకున్నా డని ఫిర్యాదులో పేర్కొన్నాడు. సీఎం వద్దకు పోయినా ఏమీ జరగదని, తనకు మంత్రి దగ్గరంటూ బెదిరించాడని తెలిపాడు. జంగిలి సాగర్‌తో తనకు ప్రాణహాని ఉందని, అతనిపై చట్టపరమైన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని సీపీకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మరో బాధితుడు కూడా కార్పొరేటర్ జంగిలి సాగర్‌పై ఫిర్యాదు చేయగా, వేరొక బాధితుడు మరో కార్పొరేటర్‌పై ఫిర్యాదు చేశాడని తెలిసింది. ఈ ఫిర్యాదులపై స్పందించిన స్పెషల్‌టీం పోలీసు అధికారులు బాధితుల నుంచి పూర్తి సమాచారం, వీడియో, ఆడియో ఆధారాలను సేకరించి విచారణను ప్రారంభించారు.

ఆలయాన్ని శుద్ధి చేసిన ఎంపీ బండి సంజయ్



కరీంనగర్, జనవరి 18 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్‌కుమార్ పద్మనగర్ శివాలయాన్ని గురువారం శుద్ధి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 22వ తేదీన రామమందిర పునఃప్రతిష్ఠ కార్యక్రమం కోసం ప్రపంచమంతా ఎదురు చూస్తోందన్నారు. ప్రధాని మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా పిలుపు మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. రాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి హిందువు ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సాయంత్రం ఇళ్లలో దీపాలు వెలిగించాలని కోరారు.

◄ పద్మనగర్‌లో శివాలయాన్ని శుద్ధి చేస్తున్న బండి సంజయ్‌కుమార్

చిన్నారుల మరణాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలి

సుభాష్‌నగర్, జనవరి 18: జిల్లాలో చిన్నారుల మరణాలను తగ్గించేందుకు తల్లిదండ్రులకు పౌష్టికాహారం, పిల్లల ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె లలితాదేవి అన్నారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో సీడీఆర్ కమిటీ సభ్యులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు పౌష్టికాహారం తీసుకునే విధంగా చూడాలన్నారు. వ్యాధి నిరోధక టీకాలు, విటమిన్-ఎ ద్రావణం సకాలంలో ఇప్పించడం ద్వారా పిల్లల ఆరోగ్యాన్ని పెంపొందించవచ్చని అన్నారు. సమావేశంలో డీఐఓ డాక్టర్ సజీదా అతహరి, అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా, డాక్టర్ శంతన్, డాక్టర్ వేణు, పిల్లల వైద్యులు డాక్టర్ దీప, డీడబ్ల్యూవో సరస్వతి, డాక్టర్ సనా జువేరియా పాల్గొన్నారు.

వరి పొలాల్లో క్షేత్ర ప్రదర్శన

కరీంనగర్ రూరల్, జనవరి 18: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ పరిశోధన స్థానం, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు గురువారం వరిపొలాల్లో క్షేత్ర పర్యటన నిర్వహించారు. కొత్తపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలో పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో వరిలో ప్రధాన సమస్య అయిన మొగి పురుగు, సల్ఫైడ్ దుష్ప్రభావాన్ని గమనించామన్నారు. నివారణ చర్యలు సూచిస్తూ రైతులు నారుమడి దశలో పిలకదశలో ఆశిస్తే మొక్కలు ఎండి చనిపోతాయన్నారు. ఆలస్యంగా ముదురు నారు నాటడం కరువు పరిస్థితులు తక్కువరాత్రి ఉష్ణోగ్రతలు ఉండి సూర్యరశ్మి రోజుకు ఏడు గంటల కంటే ఎక్కువ ఉంటే పురుగు రావడానికి ఆస్కారం ఉంటుందన్నారు. నివారణ చర్యలుచేపట్టాలని సూచిం చారు. కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎ విజయభాస్కర్, శాస్త్రవేత్తలు డాక్టర్ జి ఉషారాణి, డాక్టర్ పి మధుకర్‌రావు, జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ కె మదన్ మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి రంజిత్, రైతులు పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు


పిటిషన్ మేనేజ్‌మెంట్ సక్రమంగా అమలు చేయాలి

కరీంనగర్ క్రైం, జనవరి 18: కరీంనగర్ రూరల్ పోలీస్ సబ్ డివిజన్ స్థాయి నేరసమీక్ష సమావేశాన్ని కరీంనగర్ రూరల్ ఏసీపీ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఎస్‌హెచ్‌వోలు పిటిషన్ మేనేజ్మెంట్ సక్రమంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి కేసులైనా పెండింగ్‌లో ఉంచవద్దన్నారు. వీలైనంత త్వరగా సాక్షాధారాలను సేకరించి సంబంధిత కేసులను పరిష్కరించి సూచించారు. రూరల్ సబ్ డివిజన్ పరిధిలో పోలీసు స్టేషన్ల వారీగా పెండింగులో ఉన్న కేసుల వివరాలు, వాటి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. వాటిల్లో పెండింగ్‌కు గల కారణాలు తెలుసుకుని త్వరగా దర్యాప్తు జరిపి ముగించాలని ఆదే శించారు.

నిత్యం నమోదయ్యే క్రిమినల్ కేసులతో పాటు, ఆర్థిక నేరాలు, భూతగాదాలు, అక్రమంగా భూ ఆక్రమణ, రౌడీ షీటర్స్‌పై నిఘా, పెండింగ్ వారెంట్ల అమలు అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏసీపీలు కరుణాకర్‌రావు (రూరల్), విజయ్‌కుమార్ (సీ సీఆర్బీ), సీఐలు గోపతి రవిందర్ (చొప్పదండి), రాజ్ కుమార్ (మానకొండూరు), స్వామి (ఎల్ఎండీ), ఎస్ఐలు చంద్రశేఖర్ (కొత్తపల్లి), అభిలాష్ (గంగాధర), ఉపేంద్రచారి (చొప్పదండి), రాజేష్ (చిగురుమామిడి), నరసింగరావు (గన్నేరువరం), చేరాలు (ఎల్ఎండీ) పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి





కాలువ గండికి మరమ్మతులు చేపట్టాలి

చొప్పదండి, జనవరి 18: మండలంలోని రుక్మాపూర్ శివారులోని డి-89 కాలువకు పడ్డ గండికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఎంపీపీ చిలుక రవీందర్ అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన కాలువ గండిని పరిశీలించారు. అధికారులు వెంటనే గండిని పూడ్చాలని కోరారు.

ఫిబ్రవరి 11న ప్రవేశ పరీక్ష

తిమ్మాపూర్, జనవరి 18: తెలంగాణ రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, సాధారణ గురుకుల పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతి ప్రవేశాల కోసం ఉమ్మడి ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న నిర్వహించనున్నట్లు మండలంలోని అలుగునూర్ సీఓఈ ప్రిన్సిపాల్ దేవేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాల్గో తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ పాఠశాలలో ప్రవేశాలకు ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు.

టెండర్లకు ఆహ్వానం

కరీంనగర్ క్రైం, జనవరి 18 : కరీంనగర్ జిల్లా జైలులో ఆహారపదార్థాలు, వస్తువులు, వివిధ రకాల స్టీల్ ఫర్నిచర్ తయారీ ముడిసరుకు సరఫరా చేసేందుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ జి సమ్మయ్య గురువారం ఒక ప్రటనలో తెలిపారు. 18వ తేదీ నుంచి టెండర్ దరఖాస్తులు జైలులో అందుబాటులో ఉంటాయని, 23న టెండర్లు తెరవబడుతాయన్నారు. వివరాలకు 9494632431 ఫోన్‌లో సంప్రదించాలని కోరారు.





విద్యుత్ మోటార్ల దొంగల అరెస్ట్



మాట్లాడుతున్న ఎస్పీ ప్రభాకర్‌రావు

జగిత్యాలరూరల్, జనవరి 18: జిల్లాలోని జగిత్యాలరూరల్ మండలం, రాయికల్, బీర్‌పూర్, మెట్‌పల్లి మండలాల్లోని పలు చోట్ల కొన్నిరోజులుగా వ్యవసాయబావుల వద్ద విద్యుత్ మోటార్ల దొంగతనాలకు పాల్పడుతున్న నిర్మల్ జిల్లా కడెం మండలం పెద్దూర్ గ్రామానికి చెందిన చిన్నమనేని మహేష్, బసగుట్ట నవీన్‌లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు జిల్లా అడిషనల్ ఎస్పీ ప్రభాకర్‌రావు తెలిపారు. గురువారం జగిత్యాల రూరల్ స్టేషన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో చిందితుల వివరాలను వెల్లడించారు. ఇటీవలి కాలంలో తరచుగా వ్యవసాయబావుల వద్ద వ్యవసాయ విద్యుత్ మోటార్లు దొంగతనం జరుగుతుండటంతో ఎస్పీ సన్‌ప్రీత్‌సింగ్ ఆదేశాల మేరకు అడిషనల్ ఎస్పీ ఆధ్వర్యంలో డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, ఎస్సై సధాకర్ తో పాటు సిబ్బందితో స్పెషల్ టీం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నేరస్థులను పట్టుకునే క్రమంలో భాగంగా జగిత్యాల అర్బన్ మండలం ధరూర్ శివారులో ఎస్సై సధాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తుండగా గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో స్విఫ్ట్ డిజైర్ కారులో ఇద్దరు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినట్లు తెలిపారు. కారును తనిఖీ చేయగా అందులో నాలుగు విద్యుత్‌మోటార్లు, వాటికి సంబంధించిన పరికరాలు డిక్కీలో లభించినట్లు తెలిపారు. కారులో ఉన్న ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకొని విచారించగా జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల దొంగిలించిన వ్యవసాయవిద్యుత్ మోటార్లను విక్రయించడానికి వెళ్తున్నట్లు తెలిపారు. మరింత లోతుగా నేరస్థులను విచారించగా మరో 18 వ్యవసాయ విద్యుత్ మోటార్లను జిల్లా వ్యాప్తంగా దొంగిలించినట్లు నిందితులు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన రూరల్ సీఐ ఆరీఫ్‌అలీఖాన్, ఎస్సై సధాకర్‌లను అడిషనల్ ఎస్పీ అభినందించారు. కానిస్టేబుల్స్ నసీర్‌ఖాన్, శ్రీనివాస్, గంగాధర్ లకు రివార్డులను అందజేశారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు, విద్యుత్‌మోటార్లు

శ్రీరామపాదుకలకు ప్రత్యేక పూజలు



స్వామీజీకి స్వాగతం పలుకుతున్న ఆలయ అర్చకులు, అధికారులు

వేములవాడ, జనవరి 18: అయోధ్యలోని బాల రాముడి ఆలయంలో అభిషేకం జరిపించి తీసుకువచ్చిన శ్రీరామపాదుకలకు వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి దేవస్థానంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లిలోని శ్రీరామ పీఠంకు చెందిన స్వామీజీ సురేష్ ఆత్మారాం రామదాసు నేతృత్వంలోని బృందం ఈనెల ఏడో తేదీన అయోధ్యలోని బాలరాముడి ఆలయంలో పాదుకలకు అభిషేకం జరిపించిన అనంతరం సూరజ్ ఖుండ్, భరత్ ఖుండ్ ప్రాంతాల్లోనూ ప్రత్యేక అభిషేకం జరిపించిన శ్రీరామపాదుకలను తలపై పెట్టుకుని పాదయాత్రగా బయలుదేరి 17వ తేదీన కొండగట్టు చేరుకున్నామని స్వామీజీ సురేష్ ఆత్మరామ్ రామదాసు తెలిపారు. శ్రీరామపాదుకలతో వచ్చిన ఆయనకు ఆలయ అర్చకులు అధికారులు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఖేలో ఇండియా సౌత్ జోన్ క్రీడలకు ఎంపిక

కోనరావుపేట, జనవరి 18: ఖేలో ఇండియా ఉమెన్స్ సౌత్ జోన్ ఉషూ పోటీల్లో జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు పాల్గొనన్నట్లు ఉషూ ఎన్ఐఎస్ కోచ్ అక్కెనపల్లి వినోద్ గురువారం ఒక ప్రటనలో తెలిపారు. ఉమెన్స్ లీగ్ పోటీలు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, తమిళనాడు వారి ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పసుల జెస్సిక 39 కేజీల విభాగంలో, నూకల సుదీప్తి 33 కిలోల విభాగంలో పాల్గొనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను జిల్లా డీవైఎస్‌వో రాందాస్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ దేవత ప్రభాకర్, అక్కినపల్లి వినోద్, ఎమ్.ప్రియాంక, డి.రోహిత్ అభినందించారు.

ఇద్దరు అనుమానితుల పట్టివేత

సిరిసిల్ల క్రైం, జనవరి 18: సిరిసిల్ల పట్టణం చంద్రంపేటలోని లింగంపల్లి చంద్రయ్యకు చెందిన వ్యవసాయబావి వద్ద గురువారం కరెంటు మోటారును ఎత్తుకెలుతున్న ఇద్దరు అనుమానితులను గ్రామస్థులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. తమ కరెంటు మోటారు ఎత్తుకెళ్లారని చట్టుపక్కల తిరుగుతుండగా ద్విచక్రవాహనంపై పెట్టుకొని వెలుతున్న అనుమానితులైన గంధం సతీష్, బూర తిరుపతిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని రైతు చంద్రయ్య తెలిపారు. చంద్రయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి

హుజూరాబాద్‌రూరల్, జనవరి 18: ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తనవంతు బాధ్యతగా కృషి చేస్తానని టీపీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి టీపీఆర్టీయూ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ఉపాధ్యాయుడు ఆరె రాకేష్‌రెడ్డి ఇంట్లో ఆవరణలో నిర్వహించన సమావేశం ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భూపా లపల్లి జిల్లాలో పనిచేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై స్పష్టమైన అవగాహన ఉందని చెప్పారు. సమస్యల పరిష్కారానికి తప్పకుండా కృషి చేస్తారని తెలిపారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కారించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పర్వత సత్యనారాయణ, అధ్యక్షుడు గార్లపాటి ఉమాకర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షులు మంచిరెడ్డి అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిగుండాల్లో నడిచిన భక్తులు



అగ్ని గుండం నుంచి నడుస్తున్న భక్తులు

భీమదేవరపల్లి, జనవరి 18: కొత్తకొండ వీరభద్రస్వామి జాతరలో ప్రధాన ఘట్టమైన అగ్ని గుండాల క్రతువు భక్తి పారవశ్యంతో సాగింది. గురువారం తెల్లవారు జామున కణకణ మండే అగ్నికణాల్లోంచి భక్తులు జై వీరభద్రా..శరభ.. శరభ.. అంటూ నడుచుకుంటు వెళ్లారు. ఈ కార్యక్రమం గంటకుపైగా కొనసాగింది. కొత్తకొండ జాతర బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన అగ్నిగుండాల కార్యక్రమం బంగీమఠం పరమేశ్వరయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 4 గంటల ప్రాంతం నుంచి బంగీమఠం పరమేశ్వరయ్య పర్యవేక్షణలో అగ్ని గుండాల కార్యక్రమం కొనసాగింది. భద్రకాళి సమేత వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దక్ష యజ్ఞానికి ప్రతిరూపమైన అగ్నిగుండా కార్యక్రమానికి ముందుగా అగ్నిని ప్రతిష్ఠించారు. అగ్నిని శాంతింపచేసేందుకు స్వామివారి మూల మంత్రం జపించి అష్ట దిక్పాలకులను బంధించి ఆరాధన నిర్వహించారు. అగ్ని గుండాల్లో నడిచిన వారికి సుఖసంతోషాలతో ఉండడంతో పాటు శరీర బాధలు తొలిగిపోతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఎల్కతుర్తి కాగా కొత్తకొండ శ్రీవీరభద్రస్వామి గ్రామ పర్యటన గురువారం రాత్రి జరిగింది. దీంతో జాతర బ్రహ్మోత్సవాలు ముగిశాయని ఆలయ ఈవో కిషన్‌రావు తెలిపారు.



ఒకే రోజు వేర్వేరు కేసుల్లో నాలుగు తీర్పులు

- దాడి కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష

సిరిసిల్ల క్రైం, జనవరి 18: సిరిసిల్ల జూనియర్ సివిల్ కోర్టులో ఒకే రోజు నాలుగు తీర్పు వెలువరించారు. ఇందులో భాగంగా దాడి కేసులో నిందితుడికి మూడు సంవత్సరాల జైలు శిక్ష , రూ. 5వేల జరిమానా విధిస్తూ సిరిసిల్ల ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రవీణ్ గురువారం తీర్పు ఇచ్చారు. ప్రాసిక్యూషన్ వివరాల ప్రకారం... కోనరావుపేట మండల కేంద్రానికి చెందిన రాస రాజు అదే గ్రామానికి చెందిన చల్ల రాజిరెడ్డికి రూ. 5వేల అప్పు ఇచ్చాడు. అప్పు ఇవ్వమని అడిగేందుకు ఆగస్టు 23, 2016న రాజిరెడ్డి వద్దకు వెళ్లిన బాధితుడి తండ్రి నారాయణరెడ్డిపై దాడి చేసి నెట్టివేయడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటనపై బాధితుడు ఫిర్యాదు చేయగా రాజిరెడ్డిపై అప్పటి ఎస్ఐ రమేశ్‌నాయక్ కేసు నమోదుచేసి దర్యాప్తుచేసి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశాడు. ప్రాసిక్యూషన్ తరుపున పీపీ సందీప్ వాదించగా కోర్టు కానిస్టేబుల్ మోహన్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన అనంతరం నేరం రుజువుకావడంతో మెజిస్ట్రేట్ నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించారని ఎస్ఐ అంజనేయులు తెలిపారు.

● చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు..

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష , రూ. 5వేల జరిమానా విధించారు. సిరిసిల్ల పట్టణంలో జనవరి 15, 2015న జరిగిన గంగమ్మ జాతరలో జాతరకు వెళ్లిన వీరవేణి లత మెడలో నుంచి నిందితుడు రెండున్నర పుస్తెలతాడు లాక్కొని పారిపోయాడు. ఈ సంఘటనపై బాధితురాలు ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్ఐ బాలకృష్ణ కేసు నమోదుచేసి గాలింపు చేపట్టగా అనుమానితుడైన అల్లెపు కృష్ణను పట్టుకొని రిమాండ్‌కు తరలించారు. అల్లెపు కృష్ణపై నేరం రుజువుకావడంతో మెజిస్ట్రేట్ అతడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించినట్లు సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపారు.

● లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

రోడ్డు ప్రమాదం కేసులో లారీ డ్రైవర్ మడ్లోకర్ సంతోష్‌కు రెండేళ్ల జైలు శిక్ష, రూ. 14,500 జరిమానా విధించారు. జిల్లెల్లకు చెందిన ఆటో సిరిసిల్లకు ప్రయాణికులతో వెలుతుండగా తంగళ్లపల్లి వద్ద సిద్దిపేట వైపు అతివేగంగా వచ్చిన లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఒకరు మృతిచెందగా, మరికొందరు గాయాలపాలయ్యారు. బాధితుల ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్ సంతోష్‌పై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో అప్పటి సీఐ విజయ్‌కుమార్ విచారణ చేపట్టి కోర్టులో చార్జి షీట్ దాఖలు చేశారు. మెజిస్ట్రేట్ నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష, రూ. 14,500 జరిమానా విధించారు.

● చీటింగ్ కేసులో మూడేళ్ల కఠిన శిక్ష

చీటింగ్ కేసులో నిందితుడైన సిరిసిల్లకు చెందిన కొండ రంజిత్‌కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ. 5వేల జరిమానా విధించారు. సిరిసిల్ల పట్టణంలోని చంద్రంపేటకు చెందిన రామకృష్ణ ఆర్టీసీ కొరియర్‌లో ఔట్‌సోర్సింగ్ వర్కర్‌గా పనిచేస్తుంటాడు. ఇతను విధుల్లో ఉండగా సెప్టెంబరు 5, 2023న కొరియర్‌లో లాట్ మొబైల్స్ నుంచి పార్సిల్ వచ్చిందని తప్పుడు సమాచారం ఇచ్చి నమ్మించిన రంజిత్ ఆ పార్సిల్‌ను తీసుకెళ్లాడు. కొంతసేపటికే ఆ పార్సిల్ రంజిత్‌ది కాదని ఆర్టీసీ కొరియర్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి రామకృష్ణకు సమాచారం రావడంతో వెంటనే మోసపోయానని తెలుసుకొని అతనిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు మేరకు రంజిత్‌పై కేసు నమోదుచేసి అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించారు. కేసు పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నిందితుడికి మూడేళ్ల కఠిన కారాగార జైలు శిక్ష, రూ. 5వేల జరిమానా విధించారని సిరిసిల్ల టౌన్ సిఐ రఘుపతి తెలిపారు.

కోళ్ల పందెం స్థావరంపై పోలీసుల దాడి



పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితులు

మల్లాపూర్, జనవరి, 18 : మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట గ్రామ శివా రులో నిర్వహిస్తున్న కోళ్ల పందెం స్థావరంపై గురువారం పోలీసులు దాడి చేశారు. గ్రామ శివారులోని షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో కోళ్ల పందాలను నిర్వహిస్తున్నట్లు అందిన సమాచారంతో సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ సిబ్బందితో దాడి చేసినట్లు తెలిపారు. పందెం నిర్వహిస్తున్న ఐదుగురితో పాటు మూడు కోళ్ళ, రు. 4500లు, వారి ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పందెలాలో పాల్గొన్న మరి కొంత మంది పారిపోయినట్లు వారు తెలిపారు. పందెం నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్ట్

- రిమాండ్‌కు తరలించిన పోలీసులు

మెట్‌పల్లి రూరల్, జనవరి, 18 : మండలంలో ఓ వ్యక్తిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై చిరంజీవి గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కోండ్రికర్ల గ్రామానికి చెందిన మెండే రవిపై అదే గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ ఈనెల 17న గ్రామంలో ఇనుప రాడుతో దాడికి పాల్పడడంతో రవి తీవ్రగాయాలపాలయ్యాడు. బాధితుడు తండ్రి మెండే చిన్నభూమయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం మండలంలోని పెద్దాపూర్ గ్రామ ఎక్స్‌రోడ్‌లో నిందితుడు ఆకుల శ్రీనివాస్‌ను పట్టుకొని అరెస్టు చేశామని చెప్పారు. దాడికి ఉపయోగించిన ద్విచక్ర వాహనం, ఇనుప రాడును స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

రాయికల్, జనవరి 18: మండలంలోని కట్కాపూర్ గ్రామ శివారులోని మామిడి తోటలో గురువారం పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకుని అరెస్టు చేసినట్లు ఎస్సై అజయ్ తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7890 జప్తు చేసినట్లు వివరించారు. గ్రామాల్లో పేకాడుతున్నట్లు గుర్తిస్తే తమకు సమాచారం అందించాలని ఆయన ప్రజలను కోరారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసుల్లో ఏడుగురికి జైలు.. జరిమానా

కరీంనగర్ క్రైం, జనవరి 18: కరీంనగర్ పట్టణంలో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 24 మంది వాహనదారులను గురువారం కరీంనగర్ కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా మేజిస్ట్రేట్ ఇందులో నుంచి ఇద్దరు వ్యక్తులకు పది రోజుల జైలు శిక్ష, ఇద్దరు వ్యక్తులకు ఐదు రోజుల జైలు శిక్ష, ముగ్గురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్షతోపాటు మొత్తం 14 వేల రూపాయలు జరిమానా విధించారని ట్రాఫిక్ ఏసీపీ ఎండీ సర్వర్ తెలిపారు. మిగతా 17 మంది వాహనదారులకు జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రతిరోజు కరీంనగర్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్ ఉంటాయని ఒకవేళ మద్యం సేవించి వాహనాలు నడిపినట్లయితే జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని ఈ సందర్భంగా ఏసీపీ హెచ్చరించారు. ఇప్పటి వరకు ఈ ఏడాది 30 మంది వ్యక్తులకు జైలు శిక్ష పడిందని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదాలకు గురి కావద్దని, అదేవిధంగా జైలు శిక్షకు గురి కావద్దని సూచిం చారు. జైలు శిక్ష పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా సస్పెండ్ చేసేందుకు ఆర్టీఏ కార్యాలయానికి సిఫారసు చేయనున్నట్లు తెలిపారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సుల ఫిట్‌నెస్ తనిఖీ చేయాలి

- ఎంవీఐకి ఏఐఎస్ఎఫ్ నాయకుల వినతి

హుజూరాబాద్, జనవరి 18: హుజూరాబాద్ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలలు, డిగ్రీ కళాశాలల బస్సుల ఫిట్‌నెస్‌ను తనిఖీ చేయాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం ఎంవీఐ ఠాకూర్‌సింగ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేష్ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రైవేట్ పాఠశాలలు, డిగ్రీ కళాశాలల బస్సుల ఫిట్నెస్‌తో పాటు డ్రైవర్ల లైసెన్స్‌లను తనిఖీ చేయాలన్నారు. దాదాపుగా 30 బస్సులకు పైగా ఉన్నాయని చెప్పారు. అందులో ఫిట్‌నెస్ లేని బస్సులను గుర్తించి వాటిని సీజ్ చేసి ఆయా ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాము, వేణుగోపాల్, కృష్ణ, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

అత్యధిక ఎంపీ స్థానాలు గెలువాలి

● మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
● 28న నిర్వహించే అమిత్‌షా సమ్మేళనానికి తరలిరావాలి
● ఎంపీ, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



హాజరైన నాయకులు, కార్యకర్తలు

సిరిసిల్ల రూరల్, జనవరి 18: జరగబోయో పార్లమెంట్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీకి అత్యధిక స్థానాల్లో గెలిపిస్తే తెలంగాణకు కేంద్రం నుంచి అదనపు నిధులు తీసుకొస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ తెలిపారు. సిరిసిల్ల పట్టణంలోని ఓ పంక్షన్‌హాల్‌లో గురువారం జరిగిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ సమావేశానికి బండి సంజయ్ హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం చేసిన విజయాలతోపాటు అందించిన నిధుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కరీంనగర్‌లో ఈనెల 28న జరిగే సమ్మేళనానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వస్తున్నారని సభను విజయవంతం చేయాలన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజవర్గ పరిధిలోని క్రియాశీల కార్యకర్తలతో నిర్వహించే ఈ సమ్మేళనంలో ఒక్కో పోలింగ్ బూత్ పరిధిలోని 20 మంది కార్యకర్తల చొప్పున పార్లమెంట్ పరిధిలో దాదాపు 40వేల మంది కార్యకర్తలు హాజరవుతారన్నారు. రాబోయో పార్లమెంట్ ఎన్నికలను పార్టీ నేతలకు సమాయాత్తం చేయడమే లక్ష్యంగా సమావేశాలను నిర్వహిస్తామన్నారు.న రాబోయే ఎన్నికల్లో తమకు అప్పగించిన గ్రామాల్లో బీజేపీ కార్యకర్తలను సమన్వయం చేయడంతోపాటు అత్యధిక ఓట్లు సాధించి గెలుపే లక్ష్యంగా చేసుకోని పనిచేయాలని కోరారు. కార్యకర్తల జోష్ చుశాక ఎంపీ ఎన్నికల్లో పోటీకి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు భయపడుతున్నాయని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ సర్కార్ అనే విషయం అందరికి తెలుసన్నారు. రాష్ట్రంలో బీజేపీ నుంచి అత్యధిక ఎంపీలు గెలిస్తే తెలంగాణకు అదనపు నిధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కరీంనగర్ ఎంపీగా గెలుపొందిన తరువాత నియోజవర్గ అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి 10వేల



మాట్లాడుతున్న ఎంపీ బండి సంజయ్

కోట్ల నిధులను తీసుకొచ్చానన్నారు. కేంద్ర ప్రభుత్వం ఏ గ్రామానికి ఎన్ని నిధులు ఇచ్చిందనే పూర్తివివరాలను వెల్లడించడంతోపాటు అతి త్వరలో గ్రామగ్రామాన ఫ్లెక్సీలు, బోర్డులు ఏర్పాటు చేసి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల నోళ్లు మూయిస్తానని తెలిపారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ఇంచార్జ్ గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ, రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమరెడ్డి, రాష్ట్ర నాయకులు మీసాల చంద్రయ్య, క్రిష్ణారెడ్డి, చెన్నమనేని వికాస్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, బాస సత్యనారాయణ, బోయిన్‌పల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డబోయిన గోపీ, మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు బర్కం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురిలో వేద పారాయణం..వేద హవనం ప్రారంభం

ధర్మపురి, జనవరి 18: ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో సంపూర్ణ కృష్ణ యజుర్వేద క్రమ పారాయణం, సంపూర్ణ రుగ్వేద హవనం, సంపూర్ణ సామవేద పారాయణం కార్యక్రమాలు గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రజలు సుభిక్షంగా ఉండి, సుపరిపాలన అందించాలని ధర్మపురి శ్రీ మఠం పీఠాధిపతి సచ్చితానంద సరస్వతి స్వామీజీ దివ్య ఆశీస్సులతో ఈ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయి. హైదరాబాద్ శ్రీ ప్రేమిక వరద, వేదపరిపాలన సభ ఆధ్వర్యంలో ప్రముఖ ఘనాపాఠి కేదారి ఆధ్వర్యంలో వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు 21 మంది వేదపండితులు గణపతి పూజ, పుణ్యహవచనం, అంకురార్పణ, రుత్వికరణ, దీక్షాధారణ, ప్రత్యేక పూజలు, పారాయణాలు, హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సూచనల మేరకు ఆలయ వేదపండితులు, అర్చకులు, రినోవేషన్ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాలకు సహకారం అందించారు. అలాగే స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ మండపంలో కూడ వేదపండితులు పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, ముత్యాలశర్మ, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఇందారపు రామయ్య, దేవస్థానం మాజీ చైర్మన్ సంగనభట్ల దినేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆలయ సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



వేద పారాయణం చేస్తున్న సిబ్బంది

అనుమతులు లేకుండా ధర్నా చేసిన లారీ డ్రైవర్లపై కేసు నమోదు

హుజూరాబాద్, జనవరి 18: హుజూరాబాద్ పట్టణ శివారులో ఎలాంటి పోలీసుల అనుమతులు లేకుండా ధర్నా, రాస్తారోకో నిర్వహించినందుకు గాను పది మంది లారీ డ్రైవర్లపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఏసీపీ జీవన్‌రెడ్డి తెలిపారు. హిట్ అండ్ రన్ పేరు మీద లారీ డ్రైవర్లు రోడ్డుపైకి వచ్చి ధర్నా చేసి ప్రజలను ఇబ్బందులకు గురి చేసినందుకు వీరిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. కేసు నమోదైన వారిలో ఏ రవి, వి కోటేశ్వర్‌రావు, పి రాంప్రసాద్, ఎండీ మాజీత్, జాబీద్, సాజిత్, రషీద్, మోహన్, అన్వర్, అహ్మద్ ఉన్నారు. ఏసీపీ వెంట సీఐ బొల్లం రమేశ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



కొమురుమల్లు(ఫైల్)

చిగురుమామిడి, జనవరి 18: మండలంలోని ఉల్లంపల్లి-బొమ్మనపల్లి గ్రామాల సరిహద్దులో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మేడుదుల కొమురుమల్లు(52) అనే వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై బండి రాజేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బొమ్మనపల్లి గ్రామానికి చెందిన మేడుదుల కొమురుమల్లు అనే వ్యక్తి ఉదయం తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. పనులు ముగించుకోని తన మోపెడ్ (టీఎస్02ఎఫ్ఎచ్4894)పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో హుస్నాబాద్ నుంచి బొమ్మనపల్లి వైపు వెళ్తున్న గూడ్స్ వ్యాన్(టీఎస్ 24టిఎ1674) అతి వేగంతో మోపెడ్‌ను ఢీకొట్టింది. కింద పడిన కొమురుమల్లు తీవ్ర గాయాలతో ప్రమాద స్థలంలోనే మృతి చెందాడు. వ్యాన్ డ్రైవర్ మారుపాక రాజశేఖర్ నిర్లక్ష్యం, అతివేగంతో రావడం వల్లనే ప్రమాదం జరిగిందని కొమురుమల్లు భార్య కొమురవ్వ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

కేజ్‌వీల్ కింద పడి బాలుడి మృతి



జీవన్(ఫైల్)

బీర్‌పూర్, జనవరి 18: జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలోని చిత్రవేణిగూడానికి చెందిన చిక్రం జీవన్(12)అనే బాలుడు కేజ్‌వీల్ ట్రాక్టర్ కిందపడి గురువారం మృతి చెందాడు. ఏఎస్ఐ గజేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. జీవన్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. గురువారం జీవన్ సైకిల్‌పై రోడ్డువైపు వస్తున్నాడు. అదే సమయంలో గ్రామానికి చెం దిన మెస్రం సురేందర్‌కు చెందిన (టీఎస్21ఎం4249) నంబర్ గల ట్రాక్టర్‌ను డ్రైవర్ అతి వేగంగా నడుపుతూ పొలంలో పనులు ముగించుకుని వస్తున్నాడు. ఈ క్రమంలో హనుమాన్ ఆలయం వద్ద ఎదురుగా వచ్చిన జీవన్ కేజ్‌వీల్‌కు తగిలి కిందపడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. జీవన్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, జనవరి 18: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,700 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 52మంది రైతులు 534క్వింటాళ్లు విడి పత్తి, నలుగురు రైతులు ఐదు క్వింటాళ్లు గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,700, కనిష్ఠ ధర 5, 300 రూపాయలు చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) 920క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసింది.

ఎక్సైజ్‌టాస్క్‌ఫోర్స్ దాడుల్లో నాటు సారా పట్టివేత

కరీంనగర్ క్రైం/ఇల్లందకుంట, జనవరి 18: ఇల్లందకుంట మండలం సిరిసేడు గ్రామ శివారులో గురువారం జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె నాగేశ్వరరావు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించగా 20 లీటర్ల నాటుసారా పట్టుబడింది. సిరిసేడు గ్రామానికి చెందిన దుగ్యాల పరమేశ్ వద్ద నుంచి 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు సీఐ నాగేశ్వర్‌రావు తెలిపారు. 375 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామని తెలిపారు. నిందితుడు పరమేష్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. దాడుల్లో ఎస్సై శ్రీనివాస్, హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసింబి, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి అల్పాహార విందులో జగిత్యాల వాసి

ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి, జనవరి 18: విదేశి పర్యటనలో ముఖ్యమంత్రి అల్పాహార విందులో జగిత్యాల వాసి పాల్గొన్నారు. ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి తన తొలి అధికారిక విదేశీ పర్యటన కోసం దావోస్, స్విట్జర్లాండ్‌కు వెళ్లగా అక్కడ ఆయనకు ఘనంగా స్వాగతం పలికి తెలుగు ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసిన వారిలో జగిత్యాల పట్టణ వాసి ఒకరు ప్రముఖ పాత్ర వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన స్విట్జర్లాండ్ పర్యటన ముగించుకొని బయలుదేరక ముందు గురువారం ఉదయం ఎంపిక చేసిన కొందరు ప్రముఖులకు అల్పాహార విందు ఏర్పాటు చేశారు. అందులో మోహమ్మద్ ఇమ్రాన్ ఒకరు. ముఖ్యమంత్రి బృందం స్విస్‌కు వచ్చి తిరిగి వెళ్లే వరకు వెంటే ఉన్న స్థానిక తెలుగు వారిలో ఆయన కూడ ఉన్నారు.పట్టణంలోని ఖిలాగడ్డ ప్రాంతానికి చెందిన మోహమ్మద్ ఇమ్రాన్ కుటుంబ సమేతంగా స్విట్జర్లాండ్‌లో స్థిరపడ్డారు. ప్రపంచ ఆర్థిక రాజధానిగా భావించే జురిక్ నగరంలో నివసించే ఆయన తన మాతృభూమిను మరిచిపోలేదు. గల్ఫ్, స్వదేశం నుంచి స్విట్జర్లాండ్‌కు వచ్చే వారితో ఆత్మీయగా కలిసే ఆయన నగర భారతీయ ప్రముఖులలో ఒకరు. స్విట్జర్లాండ్ పర్యటనలో ఉన్న జగిత్యాలకు చెందిన మంద భీంరెడ్డిని కూడా ఆయన సాదారంగా స్వాగతం పలికారు.

భక్తుల కోసం చలువ పందిళ్ల ఏర్పాటు



ఆలయ ఆవరణలో చలువ పందిళ్లు వేస్తున్న సిబ్బంది

వేములవాడ జనవరి 18: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయ అధికారులు చలువ పందిల్ల ఏర్పాటు ప్రారంభించారు. మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లడానికి ముందు ఆనవాయితీ ప్రకారం రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకునే క్రమంలో వేలాదిమంది భక్తులు ప్రతినిత్యం వేములవాడకు తరలివస్తున్నారు. దీనికి తోడు మహాశివరాత్రి ఉత్సవాలు సమీపిస్తుండడంతో ఆలయ అధికారులు చలువ పందిల్ల ఏర్పాటుపై దృష్టి సారించారు. ఆలయ ఈవో కార్యాలయం, ఆలయ పరిసరాలతో పాటు పలు ప్రాంతాల్లో చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నారు. పగటిపూట ఎండ తీవ్రత పెరుగుతున్న క్రమంలో భక్తులు ఇబ్బందులకు గురికాకుండా చూడడానికి చలువ పందిళ్ల ఏర్పాటు చేస్తున్నామని ఆలయ డీఈ రఘునందన్ తెలిపారు. వచ్చే వేసవికాలం ముగిసే వరకు చలువ పందిళ్లు ఉంటాయని ఆయన వివరించారు.

● ప్రత్యేక లడ్డు కౌంటర్ల ఏర్పాటుకు..

మహాశివరాత్రి జాతర సందర్భంగా వేములవాడకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక లడ్డు కౌంటర్ల ఏర్పాటుపై రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం అధికారులు దృష్టి సారించారు. మహాశివరాత్రి జాతర జరిగే మూడు రోజుల పాటు భక్తులు ఆలయం పడమర వైపులోని మహిషాసుర మర్దిని ఆలయం ముందు నుంచి దక్షిణం వైపు ద్వారం నుంచి బయటకు వెళ్తుంటారు. దక్షిణ వైపు ద్వారం పక్కనే గతంలో ఆంధ్రా బ్యాంకు ఉన్న భవనంలో లడ్డు కౌంటర్లు ఏర్పాటు చేసేవారు. ఇక్కడ లడ్డు కౌంటర్లు ఏర్పాటుపై పోలీసు అధికారులు అభ్యంతరం వ్యక్తం చేయడం, భక్తులు త్వరగా బయటకు వెళ్లడానికి ఇబ్బందులు ఏర్పడడంతో ఆరుబయట స్థలంలో లడ్డు కౌంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు రాజేశ్వరపురం చివరి భాగంలోని జనరేటర్ షెడ్డు సమీపంలో కొత్తగా నిర్మించిన షెడ్డులో లడ్డు కౌంటర్ల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించారు. ఈ మేరకు ఆలయ డీఈ రఘునందన్, ఇంజనీరింగ్ విభాగం సిబ్బంది రామకిషన్‌రావు, నాగరాజు గురువారం ఏర్పాట్లు పరిశీలించారు.



లడ్డు కౌంటర్లు ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న అధికారులు

'సమ్మక్క సారలమ్మ' జాతరకు ఏర్పాట్లు

● ఉమ్మడి జిల్లాలో 50కిపైగా ప్రాంతాల్లో నిర్వహణ
● 32 చోట్ల దేవాదాయశాఖ పర్యవేక్షణలో పనులు
● భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు



గోదావరిఖనిలో జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 18: సమ్మక్క సారలమ్మ జాతరకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. జాతర మేడారంతో పాటు ఆయా ప్రాంతాల్లో నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. జాతరలు దేవాదాయశాఖతోపాటు ఆయా జాతర కమిటీలు, నిర్వాహకుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 21వ తేదీ నుంచి 24 వరకు జాతర కొనసాగనుంది. ఉమ్మడి జిల్లాలో దాదాపు 50కి పైగా ప్రదేశాల్లో, దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 32 చోట్ల జాతర జరగనుంది. దేవాదాయశాఖ, జాతర కమిటీలు, ఇతర శాఖల అధికారుల సహకారంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తున్నారు. అధికారులు, ఉత్సవ కమిటీల బాధ్యులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లా కలెక్టర్లు దేవాదాయశాఖ అధికారులతో కలసి ఈ నెల 8, 9 తేదీల్లో విడివిడిగా సమావేశం నిర్వహించారు. ఏసీ కార్యాలయంలో ఏసీ చంద్రశేఖర్ రోజువారీ సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నారు. తాగు నీరు, వైద్యం, స్నానాలకు వాటర్ ట్యాంకులు, షవర్లు, మరుగుదొడ్లు, హెల్ప్‌డెస్క్, కంట్రోల్‌రూంలు, పార్కింగ్ స్థలాలు, పందిళ్ళు, టెంట్లు, సీసీ కెమరాలు, విఐపి, స్పెషల్, ధర్మదర్శనంకోసం బారికేడ్లు, క్యూలైన్‌లు, ఈతగాళ్ళు, శానిటేషన్, మాస్కులు, సానిటైజర్లు, పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ప్రోటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిదులు, నాయకులు, అధికారులకు ఆహ్వానం, ముందస్తు బడ్జెట్, టెండర్లు, వేలములు, హుండీలు, సీళ్ళు, భద్రత, సిబ్బంది, డిప్యుటేషన్ విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని అధికారులు ఆదేశించారు. జాతర ప్రదేశాల సమీపంలో ఉన్న కాలువలు, జలాశయాలు కూడా స్నానాలకు ఉపయుక్తం కానున్నాయి. ఆయా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులను నడుపనుంది. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసు, అగ్నిమాపక శాఖలు అప్రమత్తమౌతున్నాయి. ఇప్పటికే గత 10 రోజుల నుంచి భక్తులు మొక్కులు ప్రారంభించారు.

● ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో జాతరకు బాధ్యులను నియమించారు. హుస్నాబాద్, జూపాక, మల్యాల, తనుగుల, వావిలాల ప్రాంతాలకు కె సుధాకర్ (9866440753), రేకుర్తిలో ఎ మారుతి (9441641455), చింతకుంట, కొండపల్కల, కొత్తపల్లి ప్రాంతాలకు ఎన్ అనిల్‌కుమార్ (9966881034), కేశవపట్నం, సైదాపూర్ ప్రాంతాలకు డీవీ మారుతిరావు (9490444006), వీణవంక, కేశవాపూర్, చల్లూరు, కోరుకల్, దేవంపల్లి ప్రాంతాలకు ఎస్ శ్రీనివాస్ (9290614694), వి వెంకన్న (9440026387) ఉన్నారు. ఆయా ప్రాంతాలకు అదనపు ఇన్‌చార్జిగా ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ పి సత్యనారాయణ (9441641967) వ్యవహరించనున్నారు. జగిత్యాల జిల్లాలో ఒకే జాతర స్థలమైన ధర్మపురిలో డి కిరణ్ ఫెస్టివల్ ఆఫీసర్‌గా వ్యవహరించనున్నారు. పెద్దపల్లి జిల్లాలో కొలనూర్, కొదురుపాక, మీర్జంపేట, హనుమంతునిపేట, పెగడపల్లి, మడక, తొగర్రాయి ప్రాంతాలకు బి సదయ్య (8523847918), నీరుకుల్ల, ఎలిగేడు, గర్రెపల్లి, తెలుకుంట ప్రాంతాలకు ఎం శంకరయ్య (9848206779), గోదావరిఖని, గుండారం, ఈసలతక్కల్లపల్లి ప్రాంతాలకు కె కాంతారెడ్డి (9963153379), గోయల్‌వాడకు కె రాజ్‌కుమార్ (9010005788) అధికారులుగా, అదనపు ఇన్‌చార్జిగా ఎండోమెంట్ ఇన్స్‌పెక్టర్ ఆర్ సుజాత వ్యవహరించనున్నారు.

● 35 లక్షల మంది..

రెండేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో దేవాదాయశాఖ ఆధ్వర్యంలో జరిగిన జాతరలలో సుమారు 12 లక్షల మంది అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ యేడు దాదాపు 15 లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకునే అవకాశాలున్నాయని అధికారులు చెబుతున్నారు. మేడారంతో పాటు మిగతా ప్రాంతాలకు మరో 35 లక్షల మందికి వెళ్లే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే వేలకొలదిలో మేడారం వెళ్లి మొక్కులు చెల్లించుకుంటున్నారు. వారంతా స్థానికంగా జరిగే జాతరల వద్ద మరోమారు మొక్కులు తీర్చుకునేందుకు సిద్ధమవుతున్నారు. జాతరలో ఎండోమెంట్ ఇన్స్పెక్టర్లు, ఈవోలు, మేనేజర్లు, సిబ్బంది శాఖ తరపున సేవలందించనున్నారు.

జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు..



గతంలో జరిగిన అసౌకర్యాలు పునరావృతం కాకుండా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖలు, స్వచ్ఛందసంస్థల సహకారంతో పూర్తి స్థాయిలో ఏర్పాట్లను చేసున్నాం. ఆయా ప్రాంతాల్లో ఇన్‌చార్జిలను నియమించాం. జాతర ప్రారంభానికి 48 గంటల ముందు నుంచే అధికారులు విధులు నిర్వహిస్తారు. అన్ని శాఖల అధికారులకు, సిబ్బందికి భక్తులు సహకరించి ప్రశాంతంగా మొక్కులు చెల్లించుకోవాలి.

- చంద్రశేఖర్, దేవాదాయశాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్

వైన్‌షాపు ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దు

కరీంనగర్ అర్బన్, జనవరి 18: నగరంలోని ఆదర్శనగర్ బోర్డు పక్కన ఇప్పటికే ఒక వైన్‌షాపు ఉండగా మరొక వైన్‌షాపు ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారని, దీనికి అనుమతి ఇవ్వకూడదని కోరుతూ టీపీసీసీ కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ గురువారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఆదర్శనగర్‌లోని జనావాసాలు, రామాలయం, హనుమాన్ గుడి, చర్చి, ఆసుపత్రులుండగా ఇదే ప్రాంతంలో మరో వైన్‌షాపు ఏర్పాటు చేయటం మూలంగా మందుబాబులతో స్థానిక ప్రజలు, మహిళలు ఇబ్బందుల పాలవుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోనాల శ్రీనివాస్, అబ్దుల్ రహమాన్, మహమ్మద్ అమీర్, మహమ్మద్ ఇమ్రాన్, కంకణాల అనిల్ ఉన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేత

గణేశ్‌నగర్, జనవరి 18: నగరంలో విద్యుత్ పనుల్లో భాగంగా శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-1, 2 ఏడీఈలు సాయినేని నరేందర్, సుధీర్‌కుమార్ తెలిపారు. విద్యుత్ సరఫరా నిలిపివేయు ప్రాంతాలు 11 కెవి అలకాపురి ఫీడర్ పరిధిలో అలకాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్, 33/11 కెవి సబ్‌స్టేషన్ల పరిధిలో ఎస్ఆర్ఆర్ కళాశాల, 33 కెవి పరిధిలో భాగ్యనగర్, సంతోష్‌నగర్, సెయింట్‌జాన్స్‌స్కూల్ ప్రాంతం, కొత్తయాస్వాడ, ఎస్ఆర్ఆర్ కళాశాల వెనుకవైపు ప్రాంతం, కొత్త లేబర్ అడ్డా, 33/11 సబ్‌స్టేషన్ల పరిధిలో అంబేద్కర్‌నగర్, టవర్‌సర్కిల్, బ్యాంకుకాలనీ, కాపువాడ ఫీడర్ ,వెంకటసాయి ఫీడర్, విద్యానగర్ ఫీడర్ పరిధిలో ఆర్‌టీసీ వర్క్‌షాపు, చైతన్యపురి, వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైదాపూర్: సైదాపూర్ మండంలో 11 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం మధ్యా హ్నం 1 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ బొమ్మ అంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సైదాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని జాగీర్‌పల్లి ఫీడర్, వెన్నంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని వెన్నంపల్లి టౌన్ ఫీడర్, ఆకునూర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ఆకునూర్ ఫీడ ర్, గొడిశాల సబ్ స్టేషన్ పరిధిలోని బొమ్మకల్ ఫీడర్లకు అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగ దారులు గమనించి సహకరించాలని కోరారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో పారమిత విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న పారమిత విద్యాసంస్థల చైర్మన్ ప్రసాదరావు

కరీంనగర్ టౌన్/కరీంనగర్ రూరల్, జనవరి 18: రాష్ట్రీయ బాలవైజ్ఞానిక ప్రదర్శనలో పారమిత హెరిటేజ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న శుభశ్రీ సాహు ప్రతిభ చాటింది. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పారమిత హెరిటేజ్ పాఠశాల చైర్మన్ డాక్టర్ ఇ ప్రసాదరావు విద్యార్థిని అభినందించారు. నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఈఆర్‌టి), స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సిఈఆర్‌టి) మహారాష్ట్ర సహకారంతో పూణేలోని బాలేవాడి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి వైజ్ఞానిక ద్రర్శనలు వినూత్న ప్రాజెక్టు ఆగ్రో మెషిన్‌కు మహారాష్ట్ర గవర్నర్ రమేష్‌బైస్ నుంచి ప్రశంసలు అందుకుంది. ఈ కార్యక్రమంలో గైడ్ టీచర్ లలిత్‌మోహన్‌సాహు, డైరెక్టర్లు ప్రసూన, అనూకర్‌రావు, రశ్మిత, రాకేష్, వియుఎంప్రసాద్, వినోద్‌రావు, ప్రధానోపాధ్యాయులు, రితేష్ మెహతా, ప్రోగ్రాం హెడ్ గోపీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ సైన్స్ టాలెంట్ టెస్టు వాయిదా

కరీంనగర్ టౌన్, జనవరి 18: జనవిజ్ఞాన వేదిక రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా నిర్వహించనున్న పాఠశాల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టును ఈ నెల 19కి బదులుగా ఈ నెల 22న వాయిదా వేసినట్లు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.వెంకటేశ్వర్‌రావు, కొడిముంజ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల, జిల్లా స్థాయి పరీక్షల యధావిధిగా జనవరి 27న, ఫిబ్రవరి 3న ఉంటాయని అన్నారు. రాష్ట్ర స్థాయిలో ఫ్రిబవరి 9,10,11 తేదీల్లో జరుగుతాయని, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు మరిన్ని పూర్తి వివరాలకు 6304704413, 9703295685 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బల్మూరి వెంకట్‌ను కలిసిన నాయకులు



బల్మూరి వెంకట్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు

జమ్మికుంట, జనవరి 18: హైదరాబాద్‌లో ఎమ్మెల్సీకి నామినేషన్ వేస్తున్న సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు బల్మూరి వెంకట్, మహేష్‌గౌడ్‌ను జమ్మికుంట మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మేటి సమ్మిరెడ్డి గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కసుబోజుల వెంకన్న, మండల అధ్యక్షుడు ఎరబెల్లి రాజేశ్వర్‌రావు, బల్మూరి మాధవరావు, వొల్లాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో రైతులకు ఇబ్బందులు



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

హుజూరాబాద్, జనవరి 18: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. గురువారం హుజూరాబాద్‌లోని సిటీ సెంట్రల్ హాల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ వస్తే మార్పు వస్తుందని ఎన్నికల వేళ చెప్పారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, రైతుబంధు, వ్యవసాయానికి నీళ్ల ఇవ్వక ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. రైతులు పెట్టుబడుల కోసం డబ్బులు లేక వడ్డీ వ్యాపారుల వద్దకు వెళ్తున్నారన్నారు. వెంటనే రైతులకు రైతుబంధు వారి ఖతాల్లో జమ చేయాలన్నారు. రైతులను అన్ని రకాలుగా ఆదుకున్నది కేసీఆర్ మాత్రమేనన్నారు. సమావేశంలో జడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, జడ్పీటీసీలు పడిదం బక్కారెడ్డి, సాధవరెడ్డి, కల్యాణి, ఎంపీపీలు ఇరుమల్ల రాణి, రేణుక, సరిగోమ్ముల పావని, మమత, విజయభాస్కర్‌రెడ్డి, బాలకిషన్ రావు, సత్యనారాయణరావు, ఇంద్రసేనరెడ్డి, లత, తిరుపతిరావు, రమేష్ పాల్గొన్నారు. నియోజకవర్గంలోని 93 సర్పంచ్‌ల పదవి కాలం పూర్తి సందర్భంగా గురువారం ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వారిని సన్మానించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందనలు

చొప్పదండి, జనవరి 18: చొప్పదండి జడ్పీ బాలుర పాఠశాలకు చెందిన విద్యార్థులను అధికారులు అభినందించారు. చొప్పదండిలో గురువారం జరిగిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా జాతీయ, రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు బుర్ర వైష్ణవి, ఎ సౌమ్యలను హోం మంత్రిత్వశాఖ డైరెక్టర్ యోగేష్ మోహన్ దీక్షిత్, ఎస్‌బీఐ జనరల్ మేనేజర్ దేబసిస్ మిత్రలు అభినందించారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

● వర్ధంతి కార్యక్రమంలో టీడీపీ నాయకులు





కరీంనగర్‌లో పూలమాలలు వేస్తున్న టీడీపీ నాయకులు, హుజూరాబాద్‌లో నివాళి

కరీంనగర్ టౌన్, జనవరి 18: ప్రజల్లో రాజకీయ చైతన్యం తీసుకువచ్చిన మహానాయకుడు, మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్)కు భారతరత్న ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కల్యాడపు ఆగయ్య పేర్కొన్నారు. గురువారం ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకొని నగరంలోని ఎన్టీఆర్ విగ్రహానికి, పార్లమెంట్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి టీడీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కల్యాడపు ఆగయ్య మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీరామారావు ఒక వ్యక్తి కాదని, ఆయన ఒక శక్తి కావడం వల్లనే ప్రజలు దేవుడిలా ఆరాధిస్తారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఎడ్ల వెంకటయ్య, సాయిల్ల రాజ మల్లయ్య, సందబోయిన రాజేశం, తీగుట్ల రమేశ్, ఎర్రవెల్లి రవీందర్, తాటికొండ శేఖర్, ఎలిమెళ్ల కిషన్, బసాలత్‌ఖాన్, ఇట్ట మల్లేశం, హైగ్రీవాచారి, రొడ్డ శ్రీనివాస్ పాల్గొన్నారు.

● హుజూరాబాద్ : పట్టణంలోని అంబేద్కర్ చౌర స్తా వద్ద దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ వర్ధంతి పురస్కరించుకుని గురువారం టీడీపీ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. కార్యక్రమంలో ఎస్కే ఫయాజ్, రవీందర్, శివకోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● గంగాధర: గంగాధరలో టీడీపీ నాయకులు దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ మండ లాధ్యక్షుడు మల్కాపురం రాజేశం, నాయకులు గంగాధర కనుకయ్య, వైద భూపతి, అంజయ్య, చంద్రయ్య, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణపై ఆర్డీవోకు ఫిర్యాదు

కరింనగర్ రూరల్,జనవరి 18: కరీంనగర్ రూరల్ మండలంలోని వల్లంపహడ్ గ్రామంలోని పాత రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని వచ్చిన ఫిర్యాదుపై ఆర్‌డిఓ ఆదేశాల మేరకు అధికారుల విచారణ చేపట్టారు. రోడ్డుపై అక్రమంగా నిర్మాణాలు చేసిన భవనం, రేకుల షెడ్డు కాంపౌండ్ వాల్‌లను ఆర్అండ్‌బీ అధికారుల సమక్షంలో కూల్చివేశారు. కార్యక్రమములో తహశీల్దార్ నవీన్ కుమార్ ,ఆర్.ఎన్.బి ఎఈ, లక్ష్మణ్ కుమార్ ఆర్ఐ, రజనీకాంత్ రెడ్డి, సర్వేయర్ రాకేష్, వర్క్ఇన్స్‌పెక్టర్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

కరీంనగర్ రూరల్, జనవరి 18: కరీంనగర్ రూరల్ మండలంలోని ఎరువులు, పెస్టిసైడ్స్ దుకాణాల్లో నిల్వల ను వ్యవసాయాధికారి బి సత్యం తనిఖీ చేశారు. కరీం నగర్ రూరల్ మండలంలోని దుర్శేడ్, మెస్సర్స్ ఆర్ శ్రీని వాస్ ఫెర్టిలైజర్స్, శ్రీ లక్ష్మీనర్సింహ పెస్టిసైడ్స్, ఫెర్టిలైజర్స్ అండ్ సీడ్స్, నగునూరులోని మెసర్స్ అగ్రోస్ రైతు సేవా కేంద్రాలను పరిశీలించారు.

రేకుర్తిలో దేవాలయం శుద్ధి

కరీంనగర్ రూరల్, జనవరి 18: నగరంలోని రేకుర్తి లక్ష్మీనర్సింహాస్వామి దేవస్థానాన్ని మాజీ సర్పంచు నందెల్లి ప్రకాశ్ ఆధ్వర్యంలో గురువారం శుద్ధి చేశారు. అయోధ్యలో రామమందిరం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం ఈ నెల 22న ఉన్నందున దేవాలయాల శుద్ధి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నపురం నర్సయ్య, ఇంతియాజ్, శనిగరపు సతీష్, గుర్రం సతీష్, రాజిరెడ్డి, ఏజాజ్ కూన నర్సయ్య, అబ్దుల్లా షానవాజ్, రవి, కూల శివ, అఫ్జల్, శివ, ప్రధాన అర్చ కులు శ్రీనివాస్, వద్దవరం వేణు స్వామి, బైరవేణు స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మేడిపల్లిని కలిసిన నాయకులు



ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంను సన్మానిస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ, నాయకులు

కరీంనగర్ అర్బన్, జనవరి 18 : చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంకు గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు చెర్ల పద్మ సన్మానం చేశారు. ఎమ్మెల్యేను మర్యాద పూర్వకంగా కలిసిన చెర్ల పద్మ, నాయకులు, గ్రామస్థులు, నియోజకవర్గంలోని బల్వంతాపూర్ గ్రామాభివృద్ధికి సహాయ సహకారం అందించాలని కోరారు.

వాణీనికేతన్‌లో స్పోర్ట్స్ మీట్ ప్రారంభం

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 18: నగరంలోని వాణీనికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో గురువారం స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. విద్యాసంస్థల డైరెక్టర్ రేణుక జ్యోతి వెలిగించి, పావురాలను ఎగురవేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ విద్యార్థులకు అన్ని రంగాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల యోగాసనాలు, డంబుల్ డాన్స్ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం హన్మంతరావు, పీఈటి అంజయ్య, ప్రిన్సిపల్ ప్రశాంత్, కిడ్స్ కేర్ ఇన్‌చార్జి జేసన్ పాల్గొన్నారు.

కురుమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

గణేశ్‌నగర్,జనవరి 18: కరీంనగర్ కురుమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అయిలన్న కురుమ ఆధ్వర్యంలో రాష్ట్ర కురుమ సంఘ భవనములో రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి సభ్యులు యెగ్గె మల్లేశం కురుమ హాజరై జిల్లా కురుమ సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమములో కరీంనగర్ జిల్లా కురుమ సంఘం సహాయ కార్యదర్శి కర్రె రాజు కురుమ, జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల నర్సయ్య కురుమ, పెద్ది ధర్మయ్య కురుమ పాల్గొన్నారు.

రాజకీయంగా ఎదుర్కోలేక నీచరాజకీయాలు

● గన్నేరువరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లింగాల మల్లారెడ్డి

సుభాష్‌నగర్, జనవరి 18: తనను రాజకీయంగా ఎదుర్కోలేక నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని గన్నేరువరం గన్నేరువరం ఎంపీపీ లింగాల మల్లారెడ్డి అన్నారు. గురువారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. హన్మాజిపల్లి గ్రామానికి చెందిన కూరపాటి సంపత్, అతని కుటుంబ సభ్యులు తనపై చేసిన ఆరోపణలు నిరాధారమైనవని అన్నారు. తాను వేధింపులకు గురిచేయడం వల్లనే తన భర్త సంపత్ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని సంపత్ భార్య తనపై చేసిన ఆరోపణల్లో నిజం లేదన్నారు. తన ఇంటి ఎదురుగా సంపత్ ఇల్లు ఉందని, అతనితో నాలుగు సంవత్సరాలుగా సత్సంబంధాలు లేవన్నారు. తనపై లేనిపోని అభాండాలు వేస్తూ తన ప్రతిష్ఠకు భంగం కలిగించేవాడన్నారు. తాను బీఆర్ఎస్ పార్టీలో ఉన్నప్పటికీ మాజీ ఎమ్మెల్యేతో తనకు సత్సంబందాలు లేవని ఆరోపించారు. దాంతో తాను కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు తెలిపారు. మానకొండూరు ఎమ్మెల్యేగా కవ్వంపల్లి సత్యనారాయణ గెలుపొందగా గ్రామంలో ప్రజలు సంబరాలు నిర్వహించారని, ఈ సందర్భంగా సంపత్ తన ఇంటికి ఎదురుగా నిలబడి చెప్పు చూపెట్టాడని ఆరోపించారు. దీనిపై గ్రామస్థులు సంపత్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. సంపత్ గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్నాడని, దానిని ఎక్సైజ్ శాఖ అధికా రులు మూసి వేశారని, దానికి తననే బాధ్యుడిని చేస్తూ తనను తిట్టాడన్నారు. తనపై రాజకీయ కక్షతో, బీఆర్ఎస్ నాయకుల ప్రోద్భలంతో కూరపాటి సంపత్ భార్య కలెక్టరేట్ ఎదుట దర్నా చేసి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మీడియాలో వచ్చేంతవరకు తనకు తెలియలేదన్నారు. ఇలాంటి వాటికి తాను భయపడనన్నారు.

గ్రూపు రాజకీయాలు చేస్తే చర్యలు

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వొడితల ప్రణవ్



ఇల్లందకుంటలో మాట్లాడుతున్న వొడితల ప్రణవ్

జమ్మికుంట, జనవరి 18: గ్రూపు రాజకీయాలు చేస్తే ఎంతటి వారిని అయిన ఉపేక్షించేది లేదని, చర్యలు ఉంటాయని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితల ప్రణవ్ అన్నారు. జమ్మికుంట మండలం వేంకటేశ్వర్లపల్లిలో గురువారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రణవ్ మాట్లాడుతూ పైరవీలతో పదవులు రావనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. కష్టపడిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుందని చెప్పారు. ఇప్పటికే టీపీసీసీ హుజూరాబాద్‌లో సర్వే ప్రారంభించిందన్నారు. అనంతరం పలువు రు నాయకులు మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన వారిని గుర్తించి వారికి తగిన నామి నేటేడ్ పోస్టులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అరుకాల వీరేశలింగం, పుల్లూరి సదానందం, గూడెపు సారంగపాణి, మొలుగూరి సదయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇల్లందకుంట: కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు తప్పకుండా లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ఇంగిలే రామారావు, మండల మహిళా అధ్యక్షురాలు కొడెం రజిత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గుడేపు సారంగపాణి, జిల్లా ఫిషర్‌మేన్ బండి మల్లేష్, పెద్ది కుమార్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మొక్కులు చెల్లించుకున్న మాజీ ఎంపీ

గంగాధర, జనవరి 18: కోట్ల నర్సింహులపల్లి వీరభద్ర స్వామి ఉత్సవాలకు మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ గురువారం హాజరయ్యారు. స్వామి సన్నిధిలో నిర్వహించిన ప్రత్యేక పూజలో ఆయన పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల నాయకులు ఉన్నారు.

అవిశ్వాసంపై ఉత్కంఠ

- ఈ నెల 25న సమావేశం

జమ్మికుంట రూరల్, జనవరి 18: జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపల్లి రాజేశ్వర్‌రావుపై కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగుతుందా, నెగ్గుతుందా అన్న ఉత్కంఠ ఇప్పుడు అందరిలో మొదలైంది. గత నెల 29న కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య చైర్మన్ రాజేశ్వర్‌రావుపై 20మంది కౌన్సిలర్ల సంతకాలతో కూడిన అవిశ్వాస నోటీస్‌ను జిల్లా రెవెన్యూ అధికారికి అందజేశారు. అప్పటి నుంచి ఇరు వర్గాలు హైదరాబాద్‌లో క్యాంపులు వేశాయి. ప్రస్తుతం మల్లయ్య క్యాంపులో 16మంది సభ్యులు ఉన్నారు. కాగా చైర్మన్ వర్గంలో 14మంది ఉన్నారు. ఈ నెల 25న మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస సమావేశం ఉంది. మున్సిపల్ పరిధిలో మొత్తం 30మంది సభ్యులు ఉన్నారు. వీరిలో మూడో వంతు అంటే 20మంది సభ్యులు హాజరు కావాల్సి ఉంటుంది. లేని ఎడల అవిశ్వాసం వీగిపోయే అవకాశాలు ఉన్నాయి. చైర్మన్ వర్గం సమావేశానికి హాజరు కావద్దనే ఆలోచనతో ఇప్పటికే తమ సెల్‌ఫోన్లు స్విచ్‌ఆఫ్ చేసి దైవక్షేత్రాల పర్యటనకు వెళ్లారు. మల్లయ్య వర్గంకు చెందిన 16మంది సభ్యులు సమావేశానికి హాజరైన ఉపయోగం లేకుండా పోయే అవకాశాలు ఉన్నాయి.

భ్రూణ హత్యలు నివారించాలి

తిమ్మాపూర్, జనవరి18: భ్రూణ హత్యల నివారణకు అందరు కృషి చేయాలని తిమ్మాపూర్ ఎంపీపీ కేతిరెడ్డి వనిత అన్నారు. మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండలంలో ఉన్న అన్ని గ్రామ కమిటీల ద్వారా పిల్లల సమస్యలు పరిష్కరించాలని సూచించారు ఈ నెల 31 వరకు ఆపరేషన్ స్మైల్ టీం తనిఖీలు నిర్వహిస్తున్నాయని, చిన్న పిల్లలను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీవాణి, సీడీపీవో సబితా, తహసీల్దార్ కనకయ్య, ఎంపీడీవో రవీందర్‌రెడ్డి, ఎంఈవో శ్రీనివాస్ రెడ్డి, మండల వైద్యాధికారి ప్రణవ్, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 జిల్లా కో ఆర్డినేటర్ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

విభజన హామీలను నెరవేర్చాలి

హుజూరాబాద్, జనవరి 18: తెలంగాణ రాష్ట్ర విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు పర్చాలని టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముక్కెర రాజు అన్నారు. గురువారం హుజూరాబాద్‌లో ఈ నెల 21న హైద్రాబాద్‌లో జరిగే టీజేఎస్ సదస్సు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పదేళ్లుగా విభజన హామీలను అమలు పర్చడంలో విఫలమైందన్నారు. తెలంగాణ ప్రాంతం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం హామీలను అమలు పర్చాలన్నారు. హైద్రాబాద్‌లోని ఖైరతాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవనంలో నిర్వహించే రాష్ట్ర సదస్సుకు హాజరై జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో శివదయాల్‌సింగ్, తిరుపతి, కుమారస్వామి, సాయిరాం, వీరు, అనిల్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

రామడుగు, జనవరి 18: మండలంలోని రంగసాయిపల్లిలో గురువారం సీడీపీ నిధులు 4.60 లక్షల రూపాయలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు గురువారం ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచులు సాదు పద్మ, కోల రమేశ్, ఎంపీటీసీ గుర్ర దేవిక, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొమ్మరవేని తిరుపతి, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పులి అంజనేయులుగౌడ్ పాల్గొన్నారు.

21న తెలంగాణ జన సమితి సదస్సు

సుభాష్‌నగర్, జనవరి 18: రాష్ట్ర విభజన హామీల అమలు, కేంద్ర ప్రభుత్వ వివక్షతపై తెలంగాణ జన సమితి రూపొందించిన రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను సమితి రాష్ట్ర నాయకుడు నరహరి జగ్గారెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి, కరీంనగర్ ఉద్యమకారుల ఫోరం చైర్మెన్ కుమారస్వామి, సతీష్ మాట్లాడుతూ వందలాది మంది బలిదానాలలో సీమాంధ్ర పెట్టుబడి దారుల కబంధ హస్తాల నుంచి భౌగోళిక తెలంగాణ సాధించుకున్నామన్నారు. తెలంగాణ జన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 21న తలపెట్టిన రాష్ట్ర సదస్సును విజయ వంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యువజన సమితి జిల్లా నాయకులు తీర్థాల కుమార్, వెంకన్న, సంజీవ్, మొగిలి మల్లేశం పాల్గొన్నారు. ఐ

నకిలీ డాక్యుమెంట్లతో మోసంపై సీపీకి ఫిర్యాదు

కరీంనగర్ క్రైం, జనవరి 18: కరీంనగర్ రూరల్ మండలం మొగ్దుంపూర్ గ్రామంలోని భూమికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో నకిలీ డాక్యుమెంట్లు తయారు చేసి తనకు తప్పుడు రిజిస్ట్రేషన్ చేసి మోసానికి పాల్పడ్డాడంటూ మీర్జా అజ్మత్ అనే వ్యక్తిపై పోలీస్‌కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు బొమ్మకల్ గ్రామ శివారులోని గుంటూరుపల్లికి చెందిన మహ్మద్ రఫీక్ తెలిపారు. భూమికి సంబంధించిన ధ్రువపత్రాలన్నింటిపై రెవెన్యూ, ఇతర అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసి మోసానికి పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

రిటైర్డ్ ఉద్యోగి ఆత్మహత్య

కరీంనగర్ క్రైం, జనవరి 18 : హన్మాన్‌నగర్‌కు చెందిన రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి కిష్టయ్య గురువారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఒకటో టాణా ఎస్ఐ రవి తెలిపారు. రెండు సంవత్సరాల కింద రోడ్డు ప్రమాదంలో కిష్టయ్య కోడలు, మనవరాలు మృతి చెందగా కొడుకు తీవ్రంగా గాయపడ్డాడు. అప్పటి నుంచి కిష్టయ్య మానసిక వేదనతో బాధపడుతుండగా ఇటీవల అతని కాలు విరిగింది. దీనికితోడు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో ఇంటిపై ఉన్న డిష్ యాంటెనాకు ఉరివేసుకొని మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలు

ఇల్లందకుంట, జనవరి 18: మండలంలోని టేకుర్తి మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి నోటిఫికేషన్ విడుదలైందని, అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ మునిగడపు సత్యనారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో 100సీట్లు, 7,8,9,10వ తరగతిలలో మిగిలిన సీట్లకుగాను ఆన్‌లైన్ ద్వారా ఈ నెల 12నుంచి ఫిబ్రవరి 22వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పరీక్ష ఫీజు ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు 125, ఇతరులు 200 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు.

గంగాధర: గంగాధర మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వారుణి తెలిపారు. గంగాధరలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రథమ సంవత్సరంలో సీఈసీ, ఎంఈసీలో ప్రవేశాలకు వచ్చే నెల 6వరకు, 6,7,8 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్లకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 7995057850,8008493600 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

ఇల్లందకుంట, జనవరి 18: మండలంలోని బూజూనూర్ గ్రామానికి చెందిన వనపర్తి ఈశ్వరయ్య ఇటీవల మృతి చెందగా గురువారం బాధిత కుటుంబానికి ఎంపీపీ సరిగోమ్ముల పావని-వెంకటేష్ రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మల్లయ్య, సింగిల్ విండో డైరెక్టర్ జగన్, అయిలయ్య, చంద్రయ్య, కిరణ్, రాజయ్య, శ్యాంసుందర్ పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఇల్లందకుంట, జనవరి 18: మండలంలోని లక్ష్మాజిపల్లె గ్రామంలో మేదరి సంఘం క్యాలెండర్‌ను మాజీ మంత్రి ఈటల రాజేందర్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రవి, జడ్పీటీసీ శ్రీరాంశ్యామ్, వైస్ ఎంపీపీ జ్యోత్స్న, ఎల్లారెడ్డి, సాంబయ్య, సురేందర్‌రెడ్డి, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

హుజూరాబాద్‌రూరల్, జనవరి 18 : మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన కోమటి రంజిత్‌కుమార్(24) ఇటీవు అనారోగ్యంతో మృతి చెందగా గురువారం పద్మశాలి సంఘం నాయకులు పరామర్శించారు. మృతుడి కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ కార్యక్రమంలో నాయకులు చిలుకమారి శ్రీనివాస్, బండారి సదానందం, సబ్బని రాజేందర్, అశోక్, సత్యనారాయణ, ఇప్పలపల్లి చంద్రశేఖర్, కుడికాల సాయి, ఇప్పలపల్లి శ్రీధర్ ఉన్నారు.

బాధిత కుటుంబానికి..

చిగురుమామిడి, జనవరి 18: మండలంలోని నవాబుపేట గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బోయిని వెంకటయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గురువా రం బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మామిడి అంజయ్య పరామర్శించారు. వారి వెంట సర్పచ్ సుద్దల ప్రవీణ్, ఎంపీటీసీ సభ్యులు మంకు స్వప్న-శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వికసిత భారత్ సంకల్ప యాత్ర

సైదాపూర్, జనవరి 18: సైదాపూర్ మండలంలోని రాయికల్, రాయికల్‌తండా, ఘనపూర్ గ్రామాలలో అధికారులు, ప్రజాప్రతినిధులు వికసిత భారత్ యాత్రలో భాగంగా క్రేంద ప్రభుత్వ పథకాలు, వాటిని వినియోగించుకునే విదానం ఎల్ఈడీ ద్వారా ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాల మాహానాడు నాయకుల నిరసన

రామడుగు, జనవరి 18: మండల కేద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం మాల మాహానాడు ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు కాడె కాడె శంకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వ నందుకు నిరసన తెలియజేశామని వివరించారు. ఇప్పటికైనా అద్దంకి దయాకర్‌కు కాంగ్రెస్ పార్టీలో న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ జవ్వాజి అజయ్, జక్కుల బాబు, గునుకొండ అశోక్, క్రిస్టఫ ర్, జవాజు హన్మంతు, తిరుపతి, మధుసూదన్ పాల్గొన్నారు.

రంగోలి విజేతలకు బహుమతులు

కరీంనగర్ కల్చరల్, జనవరి 18: సంక్రాంతి సందర్భంగా మానేరు విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు రంగోలి పోటీలు నిర్వహించగా విజేతలైన 160 మంది విద్యార్థులకు గురువారం విద్యాసంస్థల చైర్మన్ కడారి అనంతరెడ్డి బహుమతలను, డైరీలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కడారి సునీతారెడ్డి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.